# పద్యధారణ – సీనియర్స్ విభాగము – కంఠస్థ పద్యములు

సూచనలు: ఉచ్చారణ స్పష్టంగా ఉండాలి. ఒత్తులు దీర్ఘాలు చక్కగా పలకాలి. రాగయుక్తంగా పాడిన పద్యాలకు అధిక ప్రాధాన్యత ఉండదు. క్రింది పద్యాలలో న్యాయ నిర్ణేతలు వారికి తోచిన కొన్ని పద్యాలు అడుగుతారు

1. గాన మాలింపక కన్ను మూయని రాజు
అంబ కౌగిటి పంజరంబు చిలుక
కొదమకండలు దేరుకొను పిల్లవస్తాదు
యుయ్యేల దిగని భాగ్యోన్నతుండు
ఊ ఊలు నేర్చిన యొక వింత చదువరి
సతిని ముట్టని నాటి సాంబమూర్తి
ప్రసవాబ్ధి తరియించి వచ్చిన పరదేశి
తనయింటి క్రొత్త పెత్తనపుదారు

ఏమిపనిమీద భూమికి నేగినాడొ
నుడువ నేర్చిన పిమ్మట నడుగవలయు;
నేండ్లు గడచిన ముందు ముందేమొకాని
యిప్పటికి మాత్ర మేపాప మెఱుగ డితడు.

2. నవమాసములు భోజనము నీర మెఱుగక
పయనించు పురిటింటి బాటసారి
చిక్కుచీకటి జిమ్ము జేనెడు పొట్టలో
నిద్రించి లేచిన నిర్గుణుండు
నును జెక్కిళుల బోసినోటి నవ్వులలోన
ముద్దులు చిత్రించు మోహనుండు
అక్షయంబైన మాతృక్షీర మధుధార
లన్నంబుగా దెచ్చుకున్న యతిథి

బట్ట గట్టడు; బిడియాన బట్టువడడు
ధారుణీ పాఠశాలలో జేరినాడు;
వారమాయెనొ ! లేదొ? మా ప్రకృతికాంత
కఱపియున్నది వీని కాకలియు నిద్ర.

3. సాధు సజ్జనులతో జగడమాడిన గీడు,
కవులతో వైరంబు గాంచ గీడు,
పరమదీనుల జిక్కబట్టి కొట్టిన గీడు,
బిచ్చగాండ్రను దుఖపెట్ట గీడు,
నిరుపేదలను జూచి నిందజేసిన గీడు,
పుణ్యవంతులదిట్ట బొసగు గీడు,
సద్భక్తులను దిరస్కారమాడిన గీడు,
గురుని ద్రవ్యము దోచుకొనినగీడు,
దుష్టకార్యము లొనరించు దుర్జనులకు
ఘనతరంబైన నరకంబు గట్టిముల్లె,
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్ట సంహార! నరసింహ! దురితదూర!

4. అడవిపక్షుల కెవ్వడాహారమిచ్చెను?
మృగజాతికెవ్వడు మేతబెట్టె?
వనచరాదులకు భోజన మెవ్వడిప్పించె
జెట్లకెవ్వడు నీళ్ళు చేదిపోసె?
స్త్రీల గర్భంబున శిశువు నెవ్వడు పెంచె?
ఫణుల కెవ్వడు పోసె బరగబాలు
మధుపాళికెవ్వడు మకరంద మొనరించె?
బసులకెవ్వడొసంగె బచ్చిపూరి?
జీవకోట్ల బోషింప నీవెకాని.

వేఱె యొకదాత లేడయ్య వెదకిచూడ!
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్ట సంహార! నరసింహ! దురితదూర!

5. అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయము స్థాపించునాడు,
ఓరుగల్లున రాజవీరలాంఛనముగ
బలు శస్త్రశాలల నిలుపునాడు.
విద్యానగర రాజవీధుల గవితకు
పెండ్లిపందిళ్ళు కప్పించునాడు .
పొట్నూరికి సమీపమున నాంధ్రసామ్రాజ్య
దిగ్జయ స్తంభ మెత్తించునాడు;

ఆంధ్రసంతతి కే మహితాభిమాన
దివ్యదీక్షాసుఖస్ఫూర్తి తీవరించె
నా మహావేశ మర్ధించి యాంధ్రులార
చల్లు డాంధ్రలోకమున నక్షతలు నేడు:

6. ఏ రాజు పంచెనో యిచట శౌర్యపుపాయ
సమ్ములు నాగులచవితినాళ్ళ,
ఏ యెట్టసంజలో సెలమి పల్లవరాజ
రమణులు కాళ్ళ బారాణు లిడిరొ,
చిత్రరథస్వామి శ్రీ రథోత్సవములో
తెలుగు పిల్లలు కత్తి త్రిప్పి రెపుడొ,
ఏ రెండు జాముల యినుని వేడిమి వచ్చి
కలిసిపోయెనొ త్రిలింగ ప్రభువుల;

నాజగచ్ఛ్రేయసంబులై యలరు, తొంటి
వేంగిరాజుల పాదపవిత్రచిహ్న
గర్భితమ్మైన, యీ భూమిఖండమందు
నశ్రువులు జార్తు జీవచ్ఛవాంధ్రజనులు:

7. సింహాసనము చారుసితపుండరీకంబు,
చెలికత్తె జిలువారు పలుకు జిలుక,
శృంగార కుసుమంబు చిన్ని చుక్కలరాజు,
పసిడికిన్నెరవీణ పలుకు దోడు,
నలువనెమ్మోము దమ్ములు కేళిగృహములు,
తళుకుటద్దంబు సత్కవుల మనసు,
వేదాదివిద్యలు విహరణస్థలములు,
చక్కని రాయంచ యెక్కిరింత,

యెపుడు నేదేవి, కాదేవి యిందు కుంద
చంద్ర చందన మందారసార వర్ణ
శారదాదేవి మామక స్వాంత వీధి
నిండువేడుక విహరించుచుండు గాత.

8. తరుణార్క కబళనోద్ధతి జూపె నెవ్వాడు
రుచులచే, ఫలమోహరుచుల చేత,
నకలంక రామముద్రిక బూనె నెవ్వాడు
శయముచే, హృత్కు శేశయముచేత,
మున్నీరు బల్వలంబుగ దాటె నెవ్వాడు
జవముచే, గుణగణార్జవము చేత,
నక్షశిక్షాప్రౌఢి నలరారె నెవ్వాడు
రణముచే, నియమధారణము చేత,

ధరణి నెవ్వాడు దానవద్విరదదళన
విహృతి దనకేసరికిశోరవృత్తి దెలిపె,
నతని మత్కావ్య భవ్యవాగమృతఘటన
మంజులస్వాంతు హనుమంతు మది దలంతు.

9. తన యందు నఖిల భూతములందు నొక భంగి
సమహితత్వంబున బరగువాడు
పెద్దల బొడగన్న భృత్యునికైవడి
చేరి నమస్కృతుల్ సేయువాడు
కన్నుదోయికి నన్యకాంతలడ్డంబైన
మాతృభావన సేసి మరలువాడు
తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను
దీనులగావ జింతించువాడు

సములయెడ సోదరస్థితి జరుపువాడు
దైవతములంచు గురువుల దలచువాడు
లీలలందును బొంకులు లేనివాడు
లలిత మర్యాదుడైన ప్రహ్లాదుడధిప !

10. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము,
విష్ణు నాకర్ణించు వీనులు, వీనులు
మధువైరి దవిలిన మనము మనము,
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి,

దేవదేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి హరి జేరు మనియెడి తండ్రి, తండ్రి

11. మందయానము నేర్పు నిందిందిరాజీవ
రాజీవరాజ న్మరాళరాజి,
కలికిపల్కులు నేర్పు లలితనానావాస
నావాసనికట కానన శుకాళి,
గొనబుపాటలు నేర్పు గుముదరసామోద
సామోదమధుప శుద్ధాంతసమితి,
నటనలీలలు నేర్పు దటరూఢకల్పాగ
కల్పాగచర నీలకంఠవితతి,

యన్నదీకన్య కఖిలభాగ్యములు గలుగ
మునిపురంధ్రీజనంబు దీవన లొసంగు
అతివ సైరంధ్రు లై, దాదు లై, వయస్య
లై, విపినదేవతలు ప్రోతు రనుదినంబు.

12. సగర మాంధాతాది షట్చక్రవర్తుల
యంకసీమల నిల్పినట్టి సాధ్వి,
కమలనాభుని వేణుగానసుధాంబుది
మునిగి తేలిన పరిపూత దేహ,
కాళిదాసాది సత్కవికుమారుల గాంచి
కీర్తినందిన పెద్ద గేస్తురాలు,
బుద్ధాదిమునిజనంబుల తపంబున మోద
బాష్పముల్విడిచిన భక్తురాలు.

సింధుగంగానదీజలక్షీర మెపుడు
గురిసి బిడ్డల బోషించుకొనుచు నున్న
పచ్చిబాలెంతరాలు మా భరతమాత
మాతలకు మాత, సకలసంపత్సమేత.

13. భువి కవితాకన్య బుట్టించె నెవ్వాడు,
బడి నాగమము లెల్ల నడపె నెవ్వ,
'డేను నీ' వనుమాట నెలయించె నెవ్వాడు,
కోమలపదలీల గూర్చె నెవ్వ,
డనఘతులాకోటి నలరించె నెవ్వాడు
నిఖిలగుణంబులు నేర్పె నెవ్వ,
డినకరసంప్రాప్తి నెసగించె నెవ్వాడు
రహి నించె నర్థగౌరవము నెవ్వ,

డట్టి వాణీ గురుత్వ మహత్త్వ ఖనుల
ఘనుల, బ్రాచేతస వ్యాస కాళిదాస
దండి భవభూతి మాఘసత్కవి మయూర
భారవుల, భారవుల, నాత్మ బ్రస్తుతింతు.

14. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని,
యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని,
కవివృషభులు మహాకావ్య మనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని,
యైతిహాసికు లితిహాస మనియు
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ,
యం బని మహి గొనియాడుచుండ

వివిధ వేదతత్త్వ వేది వేదవ్యాసు,
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీన మై,
పరగుచుండ జేసె భారతంబు.

15. గోదావరీ పావనోదారవా:పూర
మఖిల భారతము మాదన్నునాడు,
తుంగభద్రాసముత్తుంగ రావముతోడ
కవులగానము శ్రుతి గలయునాడు,
పెన్నానదీ సముత్పన్న కైరవదళ
శ్రేణిలో తెన్గు వాసించునాడు,
కృష్ణాతరంగ నిర్ణిద్రగానముతోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు:

అక్షరజ్ఞాన మెఱుగదో యాంధ్రజాతి
విమలకృష్ణానదీ సైకతములయందు
కోకిలపుబాట పిచ్చుకగూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణి మానిశలయందు: